ఆగని నకిలీ దందా

గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన ఓ రైతు ఐదెకరాల్లో మిరప సాగు చేశాడు. నియోజకవర్గంలోని ఓ డీలర్ వద్ద పంటకు సరిపడా మందులను అప్పుగా తీసుకున్నాడు. ఎరువులు, పురుగు మందుల కోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశాడు. అయినా తెగుళ్లు అదుపులోకి రాలేదు. పంట చివరి వరకూ నీరుపెట్టి కాపాడినా కేవలం రూ.33 వేలు మాత్రమే రైతుకు దక్కింది. సంబంధిత డీలర్ మాత్రం తన అప్పు కట్టాల్సిందేనని నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇలా ఒకరు ఇద్దరు కాదు చాలా మంది నష్టపోవాల్సి వస్తోంది.

- ఇష్టారాజ్యంగా పురుగు మందుల విక్రయాలు
- పలు కంపెనీలను అంటగట్టి సొమ్ములు చేసుకుంటున్న వ్యాపారులు
- అవగాహన లోపంతో నష్టపోతున్న రైతులు
- తనిఖీల్లో గుర్తించని అధికారులు



మిర్చి పంటలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

రాయదుర్గం: మిర్చి పంటపై నల్లతామర పురుగు పంజా విప్పుకుంది. ఈ వైరస్ తొలుత ఏదో ఓ మూలన కనిపించినా, రైతు మేల్కొనే లోపే పంట మొత్తం వ్యాప్తి చెంది ఆకుపై ముడత చుట్టేస్తోంది. దీని ప్రభావంతో పూత, పిందెలు రాలిపోతుంటాయి. పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతన్నలు విచ్చలవిడిగా పురుగు మందులను పిచికారీ చేసేస్తున్నారు. నల్లతామర పురుగు ఉదృతి తగ్గుతుందన్న ఆశతో రైతులు విచ్చలవిడిగా మందులు వాడుతున్నారు. దీంతో కొన్ని రకాల రసాయనాలకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రైతు అవసరాలను ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ఇబ్బడి ముబ్బడిగా ధరలు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 44 వేల ఎకరాల్లో ఈ ఏడాది మిరప పంట సాగులోకి వచ్చింది. మార్కెట్లో మిర్చికి భలే డిమాండ్ ఉండటంతో పంటను తెగుళ్ల నుండి కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ కారణంగా అధీకృత పంపిణీదారులు, డీలర్ల ద్వారా జరగాల్సిన అమ్మకాలు ఇందుకు విరుద్ధంగా అమ్మకాలు చేపట్టి రైతుల నడ్డీ విరుస్తున్నారు. డీలర్లు ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు సైన్యం పొలాల్లోకి చొరబడి ఈ వైరస్‌కు ఈ మందే పిచికారీ చేయాలని, లేకుంటే భవిష్యత్తులో దిగుబడులు రావని రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారు. తర్వాత వారి దుకాణాల నుండి తెప్పించిన మందులను పిచికారీ చేసేలా చూడటం లాంటి వ్యవహారంలో కీలక భూమిక పోషిస్తున్నారు.

కొంపముంచుతున్న ధరలు..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 150కు పైగా పురుగు మందుల దుకాణాలు ఉన్నాయి. ఎకరాకు రూ.లక్షకు పైగా మందులు పిచికారీ చేయాల్సి రావడంతో డీలర్లు రైతులతో ఒప్పందం కుదుర్చుకుని పంట పండే సమయం వరకూ అప్పుగా అందిస్తారు. ఆ తర్వాత వడ్డీ కలిపి రైతుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. జీఎస్టీ వేస్తే ఓ రేటు వేయకపోతే మరో రేటు కట్టి రైతులను నిలువునా ముంచేస్తున్నారు.

అదుపులోకి రాని 'తామర'

ఇతర రాష్ట్రాల నుంచి ఏపీలోకి గత రెండేళ్ల క్రితం ప్రవేశించిన నల్లతామర పురుగు నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని పరిస్థితి. ఇది తెలిసినా చాలా మంది రైతులు మిర్చిపై మక్కువ చావక విచ్చలవిడిగా పురుగు మందులు వినియోగిస్తూ నష్టాల పాలవుతున్నారు. ఒకే కంపెనీకి చెందిన రసాయనాన్ని వెనువెంటనే వాడితే పురుగులు నిరోధక శక్తిని పెంచుకుని పుంజుకోవడంతో రసాయనక శక్తి పలచబడి పోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలి. విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలకు అడ్డుకట్టు వేయాలి. మరోవైపు గరిష్ట చిల్లర ధరకు మించి అనధికారికంగా జరుగుతున్న విక్రయాలను నిరోధించకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఆ దిశగా వ్యవసాయశాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతులను మోసం చేస్తే చర్యలు



తామర పురుగు నివారణ పేరుతో కొందరు డీలర్లు ఇష్టారాజ్యంగా పురుగు మందులు అంటగడుతున్నట్టు తమ దృష్టికి వస్తున్నాయి. ఇది కరెక్ట్ కాదు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మందులు తామర పురుగు నివారణకు సహకరించడం లేదు. బలవంతంగా డీలర్లు అంటగడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా రైతులు ఆర్‌బీకేలను సంప్రందించాలి. వ్యవసాయ అధికారులు, సిబ్బంది సలహా మేరకే పురుగు మందులు, విత్తనాలు ఏవైనా వినియోగించాలి. బయట వ్యక్తులు చెప్పే మాటలు నమ్మి మోసపోకూడదు. బిల్లులు లేకుండా మందులు కొనుగోలు చేయవద్దు. అవసరమైన మందులు ఆర్‌బీకేల్లోనే అందుబాటులో ఉంటాయి. లేకపోతే ఆర్డర్ పెట్టి సరఫరా చేస్తాం.

– చంద్రానాయక్, జేడీఏ, అనంతపురం

క్లుప్తంగా

నేడు లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

కూడేరు: మండల పరిధిలోని కలగల్లలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు నృసింహుడి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కూడేరు: మండల పరిధిలోని జయపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ప్రాథమిక పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఓబుళపతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి స్వగృహంలో ఆయన సతీమణి భువనేశ్వరి మృతుడి తండ్రి నాగేశ్వర రావుకు రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎర్రిస్వామి, సంజీవరాయుడు, ఓబుళపతి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్మస్ హుస్సేనీ దర్గాలో ఫాతెహాలు

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు సర్మస్ హుస్సేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేయించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందురీలు చేశారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ఎంఈఓ ఓబుళపతి

బ్రహ్మసముద్రం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మండల విద్యాధికారి ఓబుళపతి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయొద్దని సూచించారు. చిన్న వయస్సులో గర్భం దాల్చితే రక్తహీనత, అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి వస్తుందని తెలియజేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా చేయూతనందిస్తుందన్నారు. ఆడపిల్లలు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, చైల్డ్ లైన్ సిబ్బంది సుహాసిని, హెచ్‌ఎం మల్లికార్జున, అంగన్‌వాడీలు సత్యమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

28 నుంచి జిల్లాస్థాయి షటిల్ టోర్నీ

ఉరవకొండ: గవిమఠ చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కరిబసవస్వామి రిక్రియేషన్ క్లబ్‌లో ఈనెల 28 నుంచి మార్చి 3 వరకూ జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు రేగాటి నాగరాజు, కార్యదర్శి శివప్ప గురువారం తెలిపారు. టోర్నీలో పాల్గొనే జట్లు రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతకు రూ.10,116, రన్నర్స్‌కు రూ.8,116 అందిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఇర్షాద్, ఈసీ సభ్యులు అన్నలయ్య రఘు, రవీంద్రనాథ్, చంద్రశేఖర్‌గౌడ్ క్లబ్ సభ్యులు చాబాల ఎర్రిస్వామి, విజయ్‌కుమార్, దండాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నముస్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను గురువారం ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం, హాస్టల్ గదులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాలలో ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

డేంజర్ 'లోడ్'



ప్రధాన రహదారిపై రాళ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

రాయదురంటౌన్: పట్టణంలోని రహదారులు, అంతర్గత రహదారుల్లో ఓవర్ లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లు ప్రమాకరంగా మారుతున్నాయి. మోతాదుకు మించి రాళ్లను తరలిస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ట్రాక్టర్ వెళ్లే సమయంలో అనుకోకుండా దారి గుండా వెళ్లే మనుషులు లేదా ద్విచక్ర వాహనదారులపై రాళ్లు పడితే అంతే సంగతులు. డ్రైవర్లను నియంత్రించి పరిమితికి మించి రాళ్లు తరలించకుండా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. ప్రమాదాలు జరిగితే గాని స్పందించారా అని ప్రశ్నిస్తున్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు

బొమ్మనహాళ్: ఇంటర్మీడియట్‌ను ఒక్క నెలలోనే పూర్తి చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అవకాశం కల్పించిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదవని, మధ్యలో మానివేసిన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులకు 2023 ఏప్రిల్ ఒక్క నెలలోనే పూర్తి చేసుకునేందుకు అవకాశం వచ్చిందన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన తెలుగు లేదా ఇంగ్లిష్ మాధ్యమంలో ఇంటర్ కోర్సు పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడికి అభినందన

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మండల మాజీ కన్వీనర్ గౌని కాంతారెడ్డిని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గౌని కాంతారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి

రాయదుర్గం: మత్త పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సెబ్ ఎస్‌ఐ హరికృష్ణ సూచించారు. పట్టణ సమీపంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం సెబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై బంగారు లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత భయంకర వ్యసనమన్నారు. దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.

వెన్నపూసను భారీ మెజారిటీతో గెలిపించాలి

కళ్యాణదుర్గం: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు ఇచ్చి బలపరచాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఓటర్లను కోరారు. గురువారం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం చేపట్టారు. పట్టభద్రుల స్థానం నుంచి వెన్నపూసకు, ఉపాధ్యాయుల స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డికి మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు కల్పిస్తున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, సచివాలయ కన్వీనర్ అర్చన, ఎంపీపీ మారుతమ్మ, సీనియర్ నాయకులు సుధీర్, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు తిమ్మరాజు, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, మండల సమాఖ్య అధ్యక్షురాలు హేమ, వక్ఫ్ బోర్డు సభ్యుడు షెక్షావలి, నాయకులు వెంకటేశులు, బిక్కి హరి, ఉమాపతి, అఫ్జల్, ఉమేష్, జోసెఫ్ కిశోర్, శ్రీకాంత్, మల్లి, సురేష్, నరేష్, గంగాధర్, హబీబ్, భీమేష్ పాల్గొన్నారు.

సన్మానం..

కళ్యాణదుర్గం: వైఎస్సార్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికైన పెరుగుపాళ్యం తిమ్మరాజు గురువారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ దంపతులను ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, సేవాదళ్ విభాగం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

రాయదుర్గం: దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా ఏపీలో మాత్రమే విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వార్డు సచివాలయాలు, పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల క్రితం వరకూ ప్రభుత్వ బడులు ఎలా ఉండేవి? సీఎంగా జగన్ వచ్చాక నాడు–నేడుతో వాటి రూపురేఖలు ఎలా మార్చారో.. ఓ సారి ఆలోచించాలన్నారు. గతంలో కూడా ఇవే నిధులు ఉన్నా చంద్రబాబు ఎందుకు చేపట్టలేదో గుర్తించాలన్నారు. నిరుద్యోగుల సమస్యను గుర్తించి దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే ఒకే నోటిఫికేషన్‌లో 1.35 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పించి, రికార్డు సాధించిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యకు తప్పక పరిష్కారం చూపుతారన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి మేధావులంతా మద్దతుగా నిలవాలన్నారు.

సరస్వతి పూజలో భావోద్వేగానికి గురైన విప్..

అనంతరం జూనియర్ కళాశాలలో సైన్స్ విద్యార్థులు చేపట్టిన సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొన్న విప్.. భావోద్వేగానికి గురయ్యారు. చిన్నప్పుడే అమ్మను పోగొట్టుకున్నా.. చదవాలనే తపన ఉన్నా పేదరికం కారణంగా గొడ్ల కాపరిగా మారానన్నారు. పొలాల్లో జొన్న పంటలో గువ్వలు కాస్తూ వారు పెట్టే అన్నమే కడుపు నింపేది. జాతకంలో ఉద్యోగ అవకాశం ఉందని తండ్రి తరచూ బాదపడేవారని గుర్తు చేసుకున్నారు. గుణిగానపల్లిలో ఉన్నత పాఠశాల రావడం.. అక్కడ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో వెతికి పట్టుకెళ్లి అక్కడ చేర్చారు. తన కష్టానికి సరస్వతి తల్లి తోడుగా నిలవడంతో 7, 10 లో ర్యాంకర్‌గా నిలిచినట్లు తెలిపారు. పోస్టుగాడ్యుయేట్‌తో పాటు యూనివర్సిటీలో గోల్డ్ మెడలిస్ట్‌గా ఖ్యాతి గడించి గురుకుల పాఠశాల వార్డెన్, ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించానని చెప్పుకొచ్చారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని, ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అమ్మవారిని అందగా అలంకరించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, పట్టణ కన్వీనర్ ముస్తాక్, పార్టీ నాయకులు పోరాళ్ల శివ, దేశాయి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, లెక్చరర్ల బృందం పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం: ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

సీఎం జగన్‌తోనే బీసీల సంక్షేమం

ఉరవకొండ: బీసీల సాధికారిత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ చందాచంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్ తదితరులు అన్నారు. గురువారం ఎంపీపీ స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టినప్పటి నుంచి మూడేళ్ల కాలంలో బీసీలకు చట్టసభల్లో, నామినేటెడ్ పార్టీ పదవుల్లో బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో 14 మంది బీసీ వర్గాలకు చెందిన వారే కావడం విశేషమన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బసవరాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వీరన్నను నియమించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ విభాగం నాయకులు కృష్ణమూర్తి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, పామిడి సలీం, సర్పంచ్ లలితమ్మ, సచివాలయల రూరల్, పట్టణ కన్వీనర్‌లు తేజోనాథ్, అసిఫ్, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు సాధుకుళ్లాయి స్వామి, డైరెక్టర్ ఎర్రిస్వామి, బీసీ సంఘం నాయకులు ముండాసు ఓబుళేసు, భీమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

నష్ట పరిహారం అందించాలని వినతి

విడపనకల్లు: కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు ప్రభాకర్, రామాంజిని, ఆదెప్పలకు నష్ట పరిహారం అందించాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన గార్గ్‌ను ఫోన్‌లో కోరారు. వివరాలు.. కూడేరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు హావళిగి గ్రామం వద్ద గొర్రెల మందలను మేపుతూ జీవనం సాగించేవారు. గురువారం ఉదయం లేచే సరికి దాదాపు 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వెంటనే గొర్రెల కాపరులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కాంతమ్మతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించాలని సూచించారు. వైద్యాధికారులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని గొర్రెలను పరిశీలించారు. దాదాపు 1,500 గొర్రెల్లో 30 గొర్రెలు మాత్రమే మూర్చ వ్యాధితో మృతి చెందినట్లు గుర్తించారు. మిగిలిన గొర్రెలకు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేశారు. చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్ లేనందున నష్ట పరిహారం రాదని పశు వైద్యాధికారులు బాధితులకు తెలియజేశారు.



హావళిగి గ్రామం వద్ద చనిపోయిన గొర్రెలు

పచ్చపత్రికపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం



రాయదుర్గం: రామోజీరావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు



ఉరవకొండ: ఈనాడు దినపత్రికను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: టీడీపీ నేతను కొట్టారంటూ ఈనాడులో పాత ఫోటోలను ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించిన రామోజీ రావు ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. ఈనాడులో ప్రచురితమైన తప్పుడు కథనాలను ఖండిస్తూ గురువారం పార్టీ నాయకులతో కలిసి క్యాంపు కార్యాలయం ఎదుట రహదారిపై ఈనాడు పత్రికలను దహనం చేశారు. రామోజీ రావు టీడీపీ మనుగడ కోసం ఉన్నది లేనట్లు చూపిస్తూ అభూత కల్పనలు రాస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల టీడీపీ నాయకుడు పట్టాభిని పోలీసులు కొట్టారంటూ.. పాత ఫొటోలను ప్రచురించి బ్యానర్ వార్తగా రాయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు గోపారం శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, మున్సిపల్ వైస్ చైర్మెన్ జయం ఫణి, ఎంపీపీ మారుతమ్మ, నాయకులు సుధీర్, పరమేశ్వరప్ప, తిరుమల వెంకటేశులు, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు తిమ్మరాజు, హేమ, మోహన్‌రెడ్డి, అఫ్జల్, మల్లి, ఉమాపతి, నరేష్ పాల్గొన్నారు.

తప్పుడు రాతలు రాయడం సిగ్గుచేటు

రాయదుర్గం: రామోజీరావుకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో ఈనాడు దినపత్రికలను దహనం చేశారు. రామోజీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం విప్ కాపు మాట్లాడుతూ.. విలువల్లేని వ్యక్తులకు పద్మశ్రీ అవార్డు అవసరం లేదన్నారు. వయస్సు మీదపడే కొద్ది రామోజీ దిగజారిపోతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ పట్ల నిత్యం తప్పుడు రాతలు రాయడమే ఓ పనిగా పెట్టుకున్నారన్నారు. విలువల్లేని రాతలు రాసే ఈనాడును ప్రజలు బహిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, వైస్ చైర్మెన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాష, పట్టణ కన్వీనర్ ముస్తాక్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు నాగప్ప, మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రామోజీరావు డౌన్‌డౌన్..

ఉరవకొండ: టీడీపీ నేత పట్టాభిని కొట్టారు అన్న శీర్షికతో ఈనాడు రెండేళ్ల క్రితం నాటి పాత ఫోటోలు పెట్టి ప్రచురించిన కథనంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం ఈనాడు దినపత్రికలతో నిరసన ర్యాలీ చేపడుతూ రామోజీ రావు డౌన్‌డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. కవితా హోటల్ సర్కిల్ వద్ద ఈనాడు దినపత్రికలను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబుళేసు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఎంపీపీ చందాచంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, సచివాలయ కన్వీనర్ అసిఫ్, పార్టీ మైనార్టీ విభాగం నాయకులు వడ్లసలీం, అన్వర్, పామిడిసలీం, తాజు, జిలాన్, జెండాజిలాన్, ఖాదర్, పట్టణ నాయకులు ఓబన్న, పచ్చిరవి, చెంగల మహేశ్వర, కృష్ణమూర్తి, ముండాసు ఓబుళేసు, ఆటో శీన పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

కూడేరు: రైతులు తాము సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిని కోల్పోవాల్సి వస్తుందని మండల వ్యవసాయాధికారి నవత తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి పంటల నమోదు చేసుకునేందుకు ఈనెల 26 వరకూ గడువు ఉందని పేర్కొన్నారు. ఇంకా చేయించుకోని రైతులుంటే వెంటనే ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

రాయదుర్గం రూరల్: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 28 లోపు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ లక్ష్మీనాయక్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ-క్రాప్ బుకింగ్ ఈ-కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలకు అర్హులు అవుతారని తెలిపారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే నష్టపోతారని వెల్లడించారు.

జిల్లా అధ్యక్షులకు అభినందన

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షుల ఎంపికలో రాయదుర్గానికి మూడు కీలక పదవులు దక్కడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన చుంచుల నాగప్పను పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప గురువారం సన్మానించారు. అనంతరం పట్టణానికి చెందిన జి.పాలక్షిరెడ్డి వాణిజ్య విభాగం, గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన గౌని కాంతారెడ్డి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమకం కావడంతో వారికి అభినందనలు తెలిపారు.

శుభకార్యం

రాయదుర్గం రూరల్: మండలంలోని టి.వీరాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుగ్గప్ప, తిమ్మక్క కుమారుడు సుధాకర్, రాధ వివాహం గురువారం జరిగింది. వివాహానికి ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు హొన్నే మల్లికార్జున హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేంద్రరెడ్డి, గోపాల మిత్ర గంగాధర, మహేష్, ఆంజనేయులు, ప్రకాష్, రామాంజినేయులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించండి

బొమ్మనహాళ్: వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లీశ్వరి తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఆశా వర్కర్లను సమన్వయం చేసుకుంటూ యాప్‌లో లాగిన్ కావాలన్నారు. ప్రజలు ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిదన్నారు. ఎండలు విపరీతంగా ఉండడం వల్ల బయట తిరగరాదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ యుగేందర్, రుక్మిణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని విడపనకల్లు మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య కోరారు. గురువారం మండలంలోని పీసీ.ప్యాపిలి, రాగులపాడు, వజ్రకరూరు, కొనకొండ్ల, చిన్నహోతురు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ రఘురాములు తదితరులు పాల్గొన్నారు.